క్లుప్తంగా...

ఉచిత ఆక్యుప్రెషర్ వైద్య శిబిరం



ఘట్‌కేసర్: ఘనాపూర్ ఎన్టీపీసీ పవర్ గ్రిడ్‌వద్ద ఆక్యుప్రెషర్ అల్టర్నేటివ్ సేమురోపతిథెరపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆక్యుప్రెషర్ మ్యాగ్నెటిక్ వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మమత, రూప్‌సింగ్, నాయకులు ఎం రమేశ్, రాజుగౌడ్, సురేశ్, శివాజీ, శ్రీను, బి రమేశ్ స్థానికులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మేడ్చల్: పట్టణంలోని మెడినోవా ఆసుపత్రిలో అగ్నిమాపక శాఖ అధికారులు అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం ఆసుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రమాదాలు సంభవించిన సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాద సమయంలో వైద్య సేవలు, స్పందించాల్సిన తీరుపై వైద్యులు వివరించారు. కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ సిబ్బంది, ఆసుపత్రి చైర్మన్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది రవి కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

వాహనదారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీపరిధిలో ఆదివారం వాహనదారులకు స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, వాహనదారులకు ఉపశమని కల్గించేందుకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఆదాం షఫీ, రఘు ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దర్గా మసీద్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మేడ్చల్: పట్టణంలోని దర్గా మసీద్‌లో ముస్లింలకు కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆదివారం మజీద్‌లో ముస్లీంలు రోజా (ఉపవాస దీక్ష) విరమించిన అనంతరం వారికి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సందీప్‌గౌడ్, మహబూబ్‌అలీ, లాయక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మల్లయ్య

ఘట్‌కేసర్: అంబేడ్కర్ అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని ఎక్సైజ్ సీఐ మల్లయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మల్లయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, దాసు, భాలయ్య, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఆనంద్, వెంకటేశ్వర్‌రావు, మహిపాల్, అంజయ్య, రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

ఘనంగా చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణమహోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్
- స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పన



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు



కీసర: శ్రీ చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి పంచదశ (15వ) వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నిత్య పూజల అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో వేలాదిగా తరలివచ్చిన భక్తజనుల మధ్య శ్రీ స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. యాదాద్రి దేవాలయ ప్రధాన అర్చకుడు స్వామివారి కల్యాణ విశిష్టతను భక్తులకు తెలియజేశారు. చీర్యాల గ్రామ పరిసరాలు శ్రీలక్ష్మీ నృసింహ్మ నామస్మరణతో మార్మోగాయి. ఈ యేడు కూడా స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణతో కలిసి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం వేదపండితులు ఆయనకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. అనంతరం భక్తులకు శ్రీ లక్ష్మీనృసింహ స్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మరో పక్క యాగశాలల్లో సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. సాయంత్రం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్, జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి పూజా కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (సోమవారం)దేవాలయంలో ఉదయం 5 గంటలకు నిత్యపూజలు, 8 గంటలకు యజ్ఞ కార్యక్రమాలు, ఉదయం 8 గంటలకు మహాపూర్ణాహుతి, అనంతరం శతఘటాభిషేకం, అలంకరణ, పంచహారతులు, నివేదన, విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం, దర్శన నారసింహ హోమం, శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, పల్లకీసేవ, పవళింపుసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు.



ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న నవీన్‌మిట్టల్



ఆలయంలో కొలువైన స్వామివారు



హోమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ తదితరులు

ఆర్థిక సాయం అందజేత

మేడ్చల్‌రూరల్: మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులకు గ్రామ మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపసర్పంచ్ పెంటమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కృష్ణ, యాదగిరి, పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ జగన్‌గౌడ్

పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్‌దాస్



మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా అత్వెల్లికి చెందిన జాకట ప్రేమ్‌దాస్ నియమితులయ్యారు. మేడ్చల్‌లో జరిగిన సమావేశంలో ప్రేమ్‌దాస్‌ను పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ లో బీజేపీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని ప్రేందాస్ అన్నారు. సమావేశంలో నాయకులు కిషన్‌రావు, ఆంజనేయులు, శ్రీకాంత్, ఈశ్వర్, వెంకటేష్‌చారి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్లాస్టిక్ నియంత్రణ



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘట్‌కేసర్: పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను వినియోగాన్ని నియంత్రించేందుకు సమష్టిగా కృషి చేయాలని ప్రముఖ సామాజిక వేత్త స్నేహలత అన్నారు. చౌదరిగూడ రోటర్‌డ్యామ్ ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులకు పర్యావరణపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 'గ్రీన్ ఆరా ఫెస్ట్' కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న పారిశ్రామికీకరణ, కాలుష్యం కారణంగా గ్లోబల్ వార్మింగ్ పెరిగి పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి గ్రీన్ ఆరా ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రీన్ ఆరా ఫెస్ట్‌లో ఆహారం, ఔషధం, ప్రాణశక్తి అందించే చెట్లపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రోటర్ డ్యామ్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి, డైరెక్టర్ శ్వేతారెడ్డి, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యమ్నంపేట్, సంస్కృతి టౌన్‌షిప్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత దోమల నివారణకు దోహదపడుతోందన్నారు. అనంతరం పబ్లిక్ టాయ్‌లెట్లకు వేసిన పెయింటింగ్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శివారెడ్డి, సూపర్‌వైజర్లు గాంధారి అశోక్, మోహన్, నర్సింగ్, సదానంద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

కృతజ్ఞత సభ ఏర్పాటు చేయండి



మంత్రిని సన్మానిస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ

మేడ్చల్‌రూరల్: ప్రపంచంలో అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకు గాను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుకునేందుకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేయాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పలువురు నాయకులు రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రిని కలిసిన వారు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో కీలక పాత్ర పోషించినందుకు మంత్రిని సన్మానించారు. త్వరలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు కృతజ్ఞత సభ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు వెళతాం..బీఆర్‌ఎస్‌ను ఎండగడతాం



గౌడవెల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని గౌడవెల్లి గ్రామంలో నిర్వహించిన హత్ సే హాత్ జోడో యాత్ర లో పాల్గొన్నారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో మేడ్చల్ నియోజకవర్గం పూర్తిగా వెనుకపడిపోయిందన్నారు. పేద పిల్లలు చదువుకునేందుకు కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఎన్నో సమస్యలు తాండవం చేస్తున్నాయని ప్రతి సమస్యపై నిరంతరం పోరాటం చేస్తునే ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, నాయకులు మహేష్‌గౌడ్, పోచయ్య, బాల్‌రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చామకూర మహేందర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం సంతోషకరమని బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీటీసీ మాలోత్ అంకిత రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ కమాన్,మెడిసిటీ చౌరస్తా వద్ద చలివేంద్రాలను ప్రారంభిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం సంతోషకరమన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన ఎంపీటీసీ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, సీనియర్ నాయకులు రాజమల్లారెడ్డి, రఘు, మహేశ్, వెంకట్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

జవహర్‌నగర్: సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వి ప్రసాద్ అన్నారు. జవహర్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు మేడ్చల్ జిల్లా కార్యదర్శి జంగిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ ప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి రుద్రవెల్లి బబ్లు, జవహర్‌నగర్ ఆటో, మోటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మంగళంపల్లి తిరుపతి, కలిశెట్టి రాజు, షేక్ ఆరీఫ్, బొంసాని నవీన్,కోడూరి శ్రవణ్,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి భవనం ప్రారంభం

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ఆదివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పర్యటించారు. మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో జరిగిన గంగమ్మతల్లి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామంలో నిర్మించిన పద్మశాలి భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లుబాయి, సర్పంచ్‌లు ఆంజనేయులు, గుర్క కుమార్‌యాదవ్, రైతుబంధు సమితీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అలియాబాద్‌లో పద్మశాలి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

చెత్త లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

కుషాయిగూడ: జీహెచ్‌ఎంసీ చెత్త లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. విజయవాడకు చెందిన కొప్పిశెట్టి శశిధర్ (24) నగరానికి వలస వచ్చి కుషాయిగూడలో నివాసం ఉంటూ చర్లపల్లిలోని ఓ చాక్లెట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు నుంచి కుషాయిగూడ వైపు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన జీహెచ్‌ఎంసీ చెత్త లారీ అతడిని ఢీకొంది. లారీ కిందపడ్డ శశిధర్‌ను సుమారు 20 మీటర్ల మేర లాక్కెళ్లడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముందుకా..వెనక్కా..

- సొమ్ము చెల్లించింది 2,224 మంది లబ్ధిదారులే
- జీవో 59 కింద అర్హత సాధించిన వారు 12,595 మంది
- రూ.10 లక్షల నుంచి రూ.80 లక్షలు చెల్లించాలన్న నోటీసులతో సందిగ్ధం
- జీఓ 58 కింద 9,169 మందికి పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి తదితరులు (ఫైల్)

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణలో భాగంగా జీఓ 59 కింద అర్హత సాధించిన 12,595 దరఖాస్తుదారుల్లో ఇప్పటి వరకు 2,224 మంది లబ్ధిదారులు మాత్రమే సొమ్ము చెల్లించారు. మిగతా దరఖాస్తుదారులు సొమ్ము చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.లక్షల్లో సొమ్ము చెల్లించాలని నోటీసులు అందించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో ఏం చేయాలో తోచక సందిగ్ధంలో తహశీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నోటీసుల్లో పేర్కొన్నట్లుగా సొమ్ము చెల్లించటం మినహా గత్యంతరం లేదని, తాము ఏమీ చేయలేమని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ సొమ్ము చెల్లించాల్సిన వారు మాత్రమే ఇందుకు సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. 45 రోజుల్లోనే సొమ్ము చెల్లించాల్సి ఉండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా మంత్రి ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలకు మొరపెట్టుకున్నా ఫలితం లేక పోవటంతో పెంచిన గడువు నేపథ్యంలో 120 గజాల లోపు ఉన్న లబ్ధిదారులు జీవో 58 కింద తిరిగి దరఖాస్తు చేసుకునేలా స్థానిక ప్రజా ప్రతినిధులు వారికి అవగాహన కల్పిస్తున్నట్లు సమాచారం.

అర్హులు వీరే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీవో 59 కింద భూక్రమబద్ధీకరణకు 28,280 దరఖాస్తులు అందగా, తుది పరిశీలన అనంతరం 12,595 వేల దరఖాస్తులు మాత్రమే అర్హత సాధించినట్లు రెవెన్యూ యంత్రాంగం పేర్కొంది. వీరు మాత్రమే సొమ్ము చెల్లించాలని పేర్కొంటూ నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ అందిన 45 రోజుల్లో సొమ్ము చెల్లించాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు 2,224 మంది లబ్ధిదారులు మాత్రమే పూర్తి స్థాయిలో సొమ్ము చెల్లించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మండలాల వారీగా దరఖాస్తులిలా

జిల్లాలో జీవో 59 కింద 28,280 దరఖాస్తులు రాగా, కుత్బుల్లాపూర్ మండలంలో 14,518 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాప్రాలో 5081 దరఖాస్తులు, కూకట్‌పల్లిలో 5055 , ఉప్పల్‌లో 457, దుండిగల్‌లో 1656, మల్కాజిగిరిలో 1424 , బాచుపల్లిలో 1412, మేడిపల్లిలో 583, బాలానగర్‌లో 389 దరఖాస్తులు వచ్చాయి. కీసరలో 697, ఘట్కేసర్‌లో 623, శామీర్‌పేటలో 677, అల్వాల్‌లో 346, మేడ్చల్‌లో 311, ఎంసీపల్లిలో 29 దరఖాస్తులు అందాయి.

లబ్ధిదారుల్లో ఆందోళన

జీఓ 59 కు విరుద్ధంగా సీసీఎల్ఏ ద్వారా కలెక్టర్ పేరుతో జారీ చేసిన నోటీసులపై తీవ్ర అందోళనకు గురైన లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పెద్ద మొత్తంలో సొమ్ము చెల్లించలేమన్నారు. నివాస స్థలాల భూక్రమబద్ధీకరణలో భాగంగా రూ.10 లక్షల నుంచి రూ.80 లక్షలు గడువు లోగా చెల్లించాలని పేర్కొనడంపై వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులపై ప్రభుత్వ పెద్దలు పునరాలోచించి... న్యాయం చేయాలని కోరుతున్నారు.

9,169 మంది లబ్ధిదారులకు పట్టాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 38,108 దరఖాస్తులు రాగా, తుది పరిశీలన తదనంతరం 9,169 దరఖాస్తులు అర్హత సాధించినట్లు రెవెన్యూ యంత్రాంగం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మండలాలు ,గ్రామాలు ,పురపాలక సంఘాల వారిగా సంబంధిత పట్టాలను కూడా లబ్ధిదారులకు వంపిణీ చేస్తున్నారు. జవహర్‌నగర్‌లో శనివారం ఒక్క రోజే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 3,619 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. మిగతా నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు ,స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ,రెవెన్యూ అధికారులతో కలిసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు.

గడువు పెంపు..అవగాహన

జీవో 58,59 కింద మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పెంచటంతో ..అర్హులైన వారి నుంచి ఎక్కువ సంఖ్యలో జీవో 58 కింద దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. జవహర్‌నగర్‌తో పాటు కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఉప్పల్ ,కూకట్‌పల్లి ,మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జీవో 58 పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రెవెన్యూ యంత్రాంగం ,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.